
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

గురువారం 3 అక్టోబరు 2024 | 5



మహాత్మా..మన్నించు

గాంధీ జయంతి రోజున యథేచ్ఛగా మాంసం, మద్యం విక్రయాలు

గాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలు, మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. అంబాజీపేటలో బుధవారం సంత మార్కెట్‌లో మాంసం, చేపల విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. అధికారులు ఎవ్వరూ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. అహింసా వాదానికి ప్రతిరూపమైన గాంధీ జయంతి రోజున మాంసం, మద్యం విక్రయాలు జరగడం దారుణమని పలువురు వ్యాఖ్యానించారు. నిషేధం ఉన్నప్పటికీ ఇలా చేస్తుంటే అధికారులు ఏం చేశారని ప్రశ్నించారు.

-● అంబాజీపేట

అంబాజీపేట మార్కెట్‌లో చేపల విక్రయం





మహాత్మునికి నివాళి అర్పిస్తున్న జేసీ నిషాంతి

మహాత్మా గాంధీజీ స్ఫూర్తిప్రదాత

- జేసీ నిషాంతి

అమలాపురం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జీవితం, ఆయన బోధనలు నేటి తరానికే కాదు భవిష్యత్తు తరాలకు కూడా స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గాంధీజీ అహింస అనే ఆయుధంతో బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టి మహాత్ముడయ్యారని కొనియాడారు. నిరాడంబరమైన జీవితానికి గాంధీ నిలువెత్తు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చిన మహాత్ముడు

ఎంపీ హరీష్‌మాధుర్



అమలాపురం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంతోనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. పరిసరాల పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చి చైతన్యం తీసుకువచ్చిన ఘనత మహాత్మాగాంధీకి దక్కుతుందన్నారు. స్వచ్ఛత హీ సేవా-2024 ముగింపు సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ముందుచూపుతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అమలు చేశారన్నారు. గంగమ్మను పూజిస్తూనే వ్యర్థాలను తీసుకువెళ్లి పంటకాల్వల్లో కలిపే సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు మాట్లాడుతూ పారిశుధ్యం పట్ల సామాజిక స్పృహను పెంపొందించడంతో జిల్లాను మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామన్నారు. 1800 మంది పారిశుధ్య కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తున్నామన్నారు. అనంతరం 22 మంది సర్పంచ్‌లు, 22 మంది సఫాయి మిత్రలు, 22 మంది పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందజేసి జ్ఞాపికలతో సత్కరించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌వీవీ కృష్ణారెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, ముప్పర్తి నాని పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు సత్కారం..



కార్మికులను సత్కరిస్తున్న జేసీ నిషాంతి

పారిశుధ్య కార్మికులకు సత్కారం

అమలాపురం టౌన్, అక్టోబరు 2: అమలాపురం పురపాలక సంఘంలో స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమం బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన 27వ వార్డులోని మార్కెట్ ఏరియాలో నిర్వహించారు. పారిశుధ్యానికి ప్రభుత్వ ఇస్తున్న ప్రాధాన్యతను ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వివరించారు. కమిషనర్ రాజు, కౌన్సిలర్లు దొంగ చిన్నా, బండారు గోవిందు, రాజి గోపి-రమేష్, కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి-చంద్రశేఖర్ తదితరులు పాల్గొని పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

జిల్లా పంచాయతీ అధికారిగా శాంతలక్ష్మి



అమలాపురం రూరల్, అక్టోబరు 2: జిల్లా పంచాయతీ అధికారిగా డి.శాంతలక్ష్మిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డీఎల్‌డీవోగా పనిచేస్తుండగా జిల్లా పంచాయతీ అధికారిగా కోనసీమ జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి డీపీవోగా పనిచేస్తున్న డి.రాంబాబు తిరిగి డ్వామా ఏపీడీగా వెళ్లే అవకాశం ఉంది. గతంలో అమలాపురం ఎంపీడీవోగా పనిచేసి కొవ్వూరు డీఎల్‌డీవోగా పనిచేస్తున్న వి.శాంతామణిని అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు.

ద్రాక్షారామలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు 7లో

వెదురుపాక విజయదుర్గా పీఠంలో దసరా సంబరాలు 8లో







అసంపూర్తిగా పునాదులు

మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో ఉన్న వేములపల్లి జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు నాణ్యతాలోపంతో జరగడంపై ఇప్పుడు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేములపల్లిలో నిబంధనలకు నీళ్లు వదిలి నాసిరకం మెటీరియల్‌తో ఇళ్లను నిర్మించిన కాంట్రాక్టర్లు ఆ తర్వాత పత్తాలేకుండా పోయారు.

ఆప్షన్.. కరప్షన్

జగనన్న కాలనీలో మూడో ఆప్షన్ తీసుకోవడమే తప్పా..

- ఇళ్లు నిర్మించి ఇస్తారంటే సంబరపడిన లబ్ధిదారులు
- తీరా నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణాలు
- పది అడుగుల పునాదికి మూడు అడుగులే వేసిన వైనం
- వేములపల్లి లేఅవుట్‌లో భారీగా అవకతవకలు
- ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల..విచారణకు ఆదేశం
- అప్పటి వరకు బిల్లుల నిలుపుదల!

● (మండపేట)



తుప్పలతో నిండిన ప్రాంతం

కొంప ముంచిన 'ఆప్షన్'

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం మూడు ఆప్షన్లు ఇచ్చి ఏదైనా ఒక ఆప్షన్ ఎంచుకోవాలని కోరింది. దీంట్లో మూడో ఆప్షన్‌గా ఇళ్లు మొత్తం ప్రభుత్వమే కట్టి ఇచ్చేది ఉంది. ఇదే కాంట్రాక్టర్లకు కాసుల పంట పండించింది. నిబంధనలకు నీళ్లు వదిలి నాసిరకం మెటీరియల్‌తో ఇళ్లను నిర్మించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం బాధ్యతలను మొత్తం 14 మంది కాంట్రాక్టర్లు తీసుకున్నారు. మొత్తం 2168 ఇళ్లల్లో 189 గృహాలు పూర్తి చేశారు. సాధారణంగా ఇక్కడ ఉన్న నేల పరిస్థితులను బట్టి 10 అడుగుల మేర పునాదులు వేయాల్సి ఉండగా కేవలం 3 అడుగులు మేర గోతులు తీసి బేస్‌మెంట్ వేసి ఇళ్లను నిర్మించారు. అవి కూడా నాసిరకం మెటీరియల్‌తో..

అసంపూర్తిగా వదిలేశారు

కాంట్రాక్టర్లు ఇక్కడ చాలా ఇళ్లను అసంపూర్తిగా వదిలేశారు. బేస్‌మెంట్ స్థాయిలో కొన్ని, గోడల స్థాయిలో కొన్ని ఇలా చాలా ఇళ్ల పూర్తవకుండానే కాంట్రాక్టర్లు పత్తాలేకుండా పోయారు. ఎన్నికల ముందే ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా అర్థాంతరంగా నిలిపేసి పరారయ్యారు.

బిల్లులు లాగేసి..

ఆప్షన్-3లో గృహ నిర్మాణ బిల్లులు లబ్ధిదారుడు ఖాతాకు జమకావు..ఎవరైతే కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణం చేస్తాడో అతడి ఖాతాలోకి జమ అవుతుంది. ఇదే కాంట్రాక్టర్లకు కలిసి వచ్చింది. అందుకే ఎలా పడితే అలా పనులు చేసి వెళ్లిపోయారు. మొత్తం రూ.11.54 కోట్ల మేర బిల్లులు వారికి రావాల్సి ఉండగా రూ.10.5 కోట్ల మేర చెల్లింపులు జరిగిపోయాయి.

లబ్ధిదారులు లబోదిబో

లబ్ధిదారుడు నుంచి ఒక ఇంటికి అదనంగా రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు ఇచ్చేలా లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇళ్ల నిర్మాణం చేయకుండా వదిలేయడంతో వారు లబోదిబోమంటున్నారు. కొన్ని ఇళ్లు అయితే బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారులు త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు. ఇటు ఆప్షన్ ఇచ్చేసుకోవడంతో వేరే విధంగా ఇళ్లు నిర్మించేందుకు వీలులేదు. అటు కాంట్రాక్టర్లు తిరిగి వచ్చి ఇళ్లు నిర్మిస్తారని అనుకోవడం కలే.. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో కాంట్రాక్టర్లు పేదల దగ్గర నుంచి దోచుకుని కొన్ని నాసిరకం ఇళ్లు నిర్మించడంతో పాటు కొన్నింటిని అసంపూర్తిగా వదిలేశారు.

ఎమ్మెల్యే వేగుళ్ల ఫిర్యాదుతో వెలుగులోకి..

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. భారీ అవినీతి జరిగిందని, లబ్ధిదారులు నష్టపోయారని తక్షణమే బిల్లులు నిలుపుదల చేయాలని ఫిర్యాదు చేయడంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.



మూతపడిన పాల్‌బ్రిక్ యూనిట్లు

చర్యలు తీసుకుంటాం: హౌసింగ్ డీఈ

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఫిర్యాదు మేరకు బిల్లులు నిలుపుదల చేశామని విజిలెన్స్ అధికారుల విచారణ అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మండపేట సబ్ డివిజనల్ గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు.



పనిచేయని యంత్రం

మూలకు చేరాయి..

- నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు
- వైసీపీ పాలనలో జిల్లాకు 455 యంత్రాలు కేటాయింపు
- రూ.3 కోట్లు వృథా

రావులపాలెం, అక్టోబరు 2: రైతులు ఎరువులు బుక్ చేసుకుని నేరుగా పొందేందుకు ఉపయోగపడతాయంటూ వైసీపీ పాలనలో ప్రచార ఆర్భాటంతో అప్పట్లో రైతు భరోసా కేంద్రాలకు కియోస్క్ యంత్రాలను కేటాయించింది. ప్రారంభించిన అనతికాలంలోనే అవి మరుగున పడటంతో నిరుపయోగంగా మారాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రైతులకు మెరుగైన సేవలు అందిస్తామంటూ హడావిడి చేసి రైతు భరోసా కేంద్రాలు నిర్మించి వైసీపీ వాటికి సిబ్బందిని నియమించింది. అనంతరం జిల్లాలోని ఆర్బీకే కేంద్రాలకు 455 కియోస్క్ యంత్రాలు (రైతులు ఎరువులు బుక్‌చేసుకునే మిషన్లు) కొనుగోలు చేసి హడావిడి హంగామాలతో వాటి ప్రారంభోత్సవాలు అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు చేశారు. అనంతరం కొద్దికాలానికే అవి మూలన పడి నిరుపయోగంగా మారాయి. కనీసం ఈ యంత్రం పేరు ఏంటి, ఎలా వినియోగించుకోవాలి అనే విషయాలు తెలిసేలోపే మూలనపడ్డాయి. ఒక కియోస్క్ యంత్రం సుమారు రూ.72 వేలు కాగా జిల్లాకు కేటాయించిన 455 యంత్రాల ఖరీదు రూ.3,27,60,000 వృథా అయ్యాయి. ఎవరి కమీషన్ల కోసం ఈ యంత్రాలు కొనుగోలు చేశారనే చర్చ అప్పట్లో సర్వత్రా వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాలను, రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేసింది. అయితే ఈ కియోస్క్ యంత్రాల వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేకుండా పోవడంతో వాటి ఊసే లేకుండా పోయింది.

ముప్పేట దాడి

వరిలో తెగుళ్ల బెడద
నష్టపోతున్న అన్నదాతలు





వరిని తెగుళ్లు చుట్టుముట్టాయి.. రైతును ఊపిరితీసుకోనీయకుండా చేస్తున్నాయి. కళ్ల ముందే పైరు దెబ్బతింటుంటే అన్నదాతలు తట్టుకోలేకపోతున్నారు.. ఈ దశలో వ్యవసాయధికారులు వారికి పలు సూచనలు చేస్తున్నారు...

● ముమ్మిడివరం

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా ఖరీఫ్‌లో వరిపై తెగుళ్ల ముప్పేట దాడి చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపైరుపై పొడ, దోమ, ఎండాకు వంటి తెగుళ్ల ఆశించడంతో రైతులు అవగాహన లోపంతో విచక్షణారహితంగా మందులు పిచికారీ చేసి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. వీటి సస్యరక్షణకు సంబంధించి శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు రైతులకు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది వైఫల్యం కారణంగా ఎరువుల దుకాణాల వాళ్లు ఏ మందు ఇస్తే అది వరిపైరుపై పిచికారీ చేసి నష్టపోతున్నారు. మూడు, నాలుగు రకాల మందులు కలిపి ఒకేసారి పిచికారీ చేయడంతో అధికంగా ఖర్చు అవ్వడమే కాక అతి సత్ఫలితాలను ఇవ్వడం లేదు. కొన్నిరకాల మందులు రెండు, మూడు రకాలు కలపకూడదు. ఎకరాకు ఒకసారి పిచికారీ చేయడానికి సుమారు రూ.2,500, రూ.3వేలు ఖర్చు చేస్తున్నారు.

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 1,57,792 ఎకరాల్లో వరిసాగు చేయగా వీటిలో ఎంటీయూ 1318 వరిరకం సుమారు 25వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ రకం వరిపైరుకు ఎండాకు తెగులు ఆశించి వరిపైరుకు నష్టం కలగచేస్తుంది. ఎంటీయూ 7029 స్వర్ణరకం సుమారు 60వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ రకంపై సుడిదోమ, పాము పొడ తెగులు ఆశించి నష్టాన్ని కలగచేస్తుంది. ఇతర రకాలు మిగతా విస్తీర్ణంలో సాగు చేశారు. వరిపైరు ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నాయి. వాతావరణంలో ఉష్ణోగ్రత హెచ్చు తగ్గులుగా ఉండడంతో ఈ తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. తెగుళ్ల, దోమపోటు అరికట్టడానికి రైతులు విచక్షణారహితంగా మందులు పిచికారీ చేయడంతో సేద్యపు వ్యయం పెరిగి రైతులు నష్టపోతున్నారు. తెగుళ్ల నివారణపై ఎరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎం.నందకిశోర్ సూచనలు, సలహాలు అందించారు.

పొడ తెగులు నివారణకు..

హెక్సాకోనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా అజాక్సీస్ట్రోబిన్ 1మిల్లీమీటరు, లేదా ప్రొపికొనజోల్ 1 మిల్లీమీటరు లేదా వాలడామైసిన్ 2 మిల్లీమీటర్లు లీటరు నీటికి కలిపి వరిపైరుపై పిచికారీ చేసుకోవాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే పది రోజుల వ్యవధిలో మరోసారి పిచికారీ చేసుకోవాలి.

ఎండాకు తెగులు నివారణకు..

ఎంటీయూ 1318 వరిరకంపై బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించి నష్టాన్ని కలుగచేస్తుంది. ఈ తెగులు ఆకు చివరి భాగాన ఏర్పడి కిందకి వ్యాపిస్తుంది.పసుపురంగు మచ్చలుగా ఏర్పడి క్రమేపీ ఆకు అంచులు ఎండిపోతాయి. తుఫాను, వర్షాలు ఆ తర్వాత ఎండలు ఎక్కువగా ఉండడం, అధిక నత్రజని వాడడం వల్ల ఈ తెగులు ఉధృతి పెరుగుతుంది. కొబ్బరిచెట్ల నీడలో ఏర్పడి ఆ తర్వాత చేనంతా వ్యాపిస్తుంది. ఈ తెగులును నివారించేందుకు తాత్కాలికంగా నత్రజని వినియోగాన్ని నిలిపివేయాలి. వరిచేనులోని మురుగునీటిని బయటకు తీసివేసి కొత్తనీటిని పెట్టుకోవాలి. ఈ తెగులు ఆశించిన వరిచేను ఎకరాకు వంద గ్రాముల ప్లాంటోమైసిన్, 450 కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. ఈ మందులలో ఏ ఇతర పురుగు మందులు గానీ, తెగుళ్ల మందులు గానీ కలపరాదు.



సుడిదోమ నివారణకు..

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గాలిలో ఉన్న అధిక తేమశాతం, అధిక ఉష్ణోగ్రత్త దోమ వ్యాప్తికి అనుకూలం. వరి దుబ్బుకు 10 నుంచి 15 దోమలు కనిపిస్తే వెంటనే ట్రైఫ్లూమిజోపూరిమ్ 96 మిల్లీలీటర్లు లేదా పైమెటోజైన్ 120 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. తెగులు ఉధృతిని బట్టి మరోసారి పిచికారీ చేసుకోవాలి. వరి పైరుకు పొడ తెగులు, దోమపోటు ఒకేసారి కనిపిస్తే పాము పొడతెగులు మందు, దోమపోటు మందు కలిపి పిచికారీ చేసుకోవచ్చు.



ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో నేటి నుంచి
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ద్రాక్షారామ, అక్టోబరు 2: అష్టాదశ శక్తి పీఠాల్లో ద్వాదశ శక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 3వ నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో వేదపారాయణ ప్రయుక్త, దేవీ భాగవతం, చండీ సప్తశతి, సుందరకాండ, మన్యుసూక్తం, లలితా పారాయణ, సూర్యనమస్కారాలు, నవగ్రహ జపాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3.30 వరకు శ్రీచక్ర నవావర్ణార్చన, 3.30 గంటలకు కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు అమ్మవారికి సువర్ణ, రజత పుష్పార్చన జరుపుతారు. మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 9న సరస్వతి పూజ, విజయదశమిని పురస్కరించుకుని 12న శమీపూజ వేగాయమ్మపేటలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తొండంగి, అక్టోబరు 2: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు పెట్రోలు బంకు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకత్తా నుంచి చెన్నై ఐరన్ షీట్ల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ ఎటువంటి హెచ్చరిక సిగ్నల్ వేయకుండా ఆకస్మికంగా ఆపివేశాడు. వెనుకనే విశాఖ నుంచి పాలకొల్లు రొయ్యల లోడు నిమిత్తం వెళ్తున్న లారీ ముందున్న లారీని బలంగా ఢీకొట్టడంతో లారీ కేబిన్ నుజ్జునుజ్జయ్యింది. అందులో చిక్కుకున్న డ్రైవర్ బలుసు వెంకటరమణకు (40) తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడిది విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీల దగ్గర బుచ్చింపేట గ్రామంగా గుర్తించారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిండుకుంటున్న నెయ్యి నిల్వలు

▸▸ గత నెలాఖరున ముగిసిన పాత కాంట్రాక్టు ▸▸ ప్రభుత్వ ఉత్తర్వుల కోసం అన్నవరం దేవస్థానం అధికారుల ఎదురుచూపు



అన్నవరం, అక్టోబరు 2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో ప్రసాదం కోసం వినియోగించే నెయ్యి నిల్వలు నిండుకుంటున్నాయి. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి కల్తీ వ్యవహారంతో అన్నవరం దేవస్థానం అధికారులు నెయ్యి వినియోగంపై తర్జనభర్జన పడుతున్నారు. అన్నవరం దేవస్థానానికి ఏటా రెండు లక్షల కిలోల నెయ్యి అవసరమవుతుంది. వరుసగా నాలుగు పర్యాయాలు టెండరు దక్కించుకున్న రైతు డెయిరీ కాంట్రాక్టు సెప్టెంబరు 30తో ముగిసింది. దీనికి సంబంధించి నెల క్రితం అక్టోబరు 1 నుంచి నెయ్యి సరఫరాకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ద్వారా తిరుపతికి చెందిన ఒక సంస్థ ఎల్-1 కాంట్రాక్టుతో టెండరు దక్కించుకోగా ఆ కంపెనీ ఇంకా కొనుగోలు ప్రారంభించలేదు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూడడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా కొనుగోలు చేయాలా, ఇటీవల ఎల్-1 కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ నుంచి కొనుగోలు చేయాలా అనే మీమాంసలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం దేవస్థానంలో నెయ్యి నిల్వలు నిండుకుంటున్నాయి. ప్రస్తుతం ఉన్న నెయ్యి మరో నాలుగు రోజులు వస్తుందని భావిస్తున్నారు. ఈలోగా ఉత్తర్వులు రాకుంటే ప్రసాదం ఎలా తయారు చేయాలో తెలియని పరిస్థితి. అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ ప్రస్తుతం దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉండడంతో కమిషనరుతో చర్చించే అవకాశముంది. కమిషనరు సైతం ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూడాలని, స్వతంత్రంగా నిర్ణయం తీసుకోకూడదని భావిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా నెయ్యి కొనుగోలు చేసేవారు. పదేళ్ల క్రితం ఈ విధంగా చేయగా అప్పటి, ప్రస్తుత ఈవో రామచంద్రమోహన్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీంతో ఆయన కూడా ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయ్‌ప్రకాశ్, కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న బాలికలు

క్రీడా సంరంభం

'శ్రీప్రకాష్'లో కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని రూరల్, అక్టోబరు 2: కాకినాడ జిల్లా తునిలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్ర, తెలంగాణ) కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు వందకు పైగా పాఠశాలల నుంచి 1,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. శాప్ రిటైర్డ్ కబడ్డీ కోచ్, ప్రో కబడ్డీ అఫీషియల్ పీవీఎస్‌వీ ప్రసాద్, ప్రో కబడ్డీ అఫీషియల్ బి.మురళీకుమార్, వాలీబాల్ నేషనల్ రిఫరీ బి.శ్రీనివాసరావు, వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు మోహన్‌బాబు హాజరయ్యారు. బాలికలకు అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలను శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, గౌరవ అతిథులు జాతీయ జెండా, సీబీఎస్ఈ స్పోర్ట్ జెండా, శ్రీప్రకాష్ జెండాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన బాలికలు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. విజయప్రకాష్ మాట్లాడుతూ గెలుపు, ఓటమి సహజమని, పోటీల్లో పాల్గొనాలనే క్రీడా స్ఫూర్తి కలిగిన వారంతా విజేతలేనన్నారు. మిమ్మల్ని పోటీలకు పంపిన తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. రెండు రాష్ట్రాల నుంచి హాజరైన జట్ల కెప్టెన్లను, సభ్యులను విజయప్రకాష్, అతిథులు పరిచయం చేసుకున్నారు. పరిశీలకులు ఎల్.వెంకటరమణ, కె.హేమంత్‌కుమార్‌రావు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



దాత సమర్పించిన నూతన పట్టు వస్త్రాలతో అర్చకులు, అధికారులు

రూ.3 లక్షలు విలువైన
పట్టు వస్త్రాలు అందజేత

అన్నవరం, అక్టోబరు 2: శరన్నవరాత్రులను పురస్కరించుకుని రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు, శంకరుడు, సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు బుధవారం ఒక దాత రూ.3లక్షలు విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు వీటిని ఆలయ సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి సుధీర్, బీఎస్ రాంబాబు పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను నవరాత్రుల్లో అలంకరిస్తామని ప్రధానార్చకుడు చెప్పారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సుప్రీంకోర్టుకు సిఫార్సు చేస్తాం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు వారి పేర్లను సుప్రీంకోర్టుకు సిఫార్సు చేస్తామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మహిళా ప్రత్యేక కారాగారంలో బుధవారం నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. మహిళా ఖైదీల సమస్యలను, కేసు వివరాలను తెలుసుకుని తగు న్యాయం చేస్తామన్నారు. మహిళా జైలు వాతావరణం సబర్మతి ఆశ్రమాన్ని తలపిస్తోందని వక్తలు ప్రశంసించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు పీడీజే బహుమతులు అందజేశారు. అనంతరం కేంద్ర కారాగారంలో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి హాజరయ్యారు. జైలులో ఖైదీల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వివిధ వస్తువుల తయారీ యూనిట్లు, నర్సరీ, నైపుణ్య శిక్షణను జైలు అధికారులు పీడీజేకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఆర్.శ్రీలత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు, మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంతకుమారి, కేంద్ర కారాగార ఉప పర్యవేక్షణాధికారి ఎం.రాజ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, జైలర్ పావని తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ సంస్థల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు

రాజానగరం, అక్టోబరు 2: జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కొనియాడారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నెలకొల్పిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. డిజిటల్ లాప్రోస్కోపిక్ సర్జికల్ యూనిట్‌ను మరో ముఖ్య అతిథి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జనరల్ వార్డులను ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం శుశ్రుత ఆడిటోరియంలో జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ 38 ఏళ్ల కిందట రాజమహేంద్రవరంలో చిన్న సంస్థగా ఆవిర్భవించిన జీఎస్ఎల్ సంస్థలు నేడు ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక వైద్య విధానాలతో విద్యనందించడమే కాకుండా సమాజానికి చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా వైద్య విద్యార్థులు, ప్రముఖులతో ప్రతిజ్ఞ చేయించారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జీఎస్ఎల్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. అతిథులకు గన్ని భాస్కరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గన్ని కాశింబి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గురునాథ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్టు

రాజానగరం, అక్టోబరు 2: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధంలోని చంద్రిక-అవంతిక అపార్ట్‌మెంట్‌లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ బుధవారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన మిట్టని సాయికుమార్, కట్టమూరి యశ్వంత్ వీర నాగ సూర్య శ్రీసత్య సాయి, దుర్గాడ పండు చంద్రిక అవంతిక అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. గంజాయి తాగే అలవాటు ఉన్న కొంతమంది యువకులను పిలిచి, వారికి గంజాయి విక్రయించి, తాగే వరకు ఇక్కడే ఉంచడం వృత్తిగా మలుచుకున్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం సీఐ సిబ్బందితో దాడి చేసి గంజాయి తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. మిగిలిన ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న ఆయిల్‌తో అధికారులు

నిల్వ స్థావరంపై అధికారుల దాడి

9,400 లీటర్ల ఆయిల్ స్వాధీనం

మామిడికుదురు, అక్టోబరు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడిలంకలో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ ఆయిల్ స్థావరంపై విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేశ్వరరావు ఏ విధమైన అనుమతి లేకుండా తన ఇంటి వద్ద ఆయిల్ నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నాడు. విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి నిల్వ ఉంచిన 9,400లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. సివిల్ సప్లయిస్ డీటీ డి.శ్రీనివాస్, వీఆర్వో రాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును, నిందితులను చూపిస్తున్న సీఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర

చెడు వ్యసనాలకు బానిసలై...చోరీల బాట

వాడపాలేనికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు... రూ.13లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

కొత్తపేట, అక్టోబరు 2: చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీ కోసం చోరీల బాటపట్టిన ఇద్దరు యువకులను బుధవారం అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం బ్యాంకు కాలనీకి చెందిన రామోజు అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి మే 5న రాజమహేంద్రవరం వెళ్లి 9న తిరిగి ఇంటికొచ్చింది. తలుపులు పగులకొట్టి బీరువాలో ఉన్న సుమారు రెండు కిలోల వెండి వస్తువులు, 212 గ్రాముల బంగారు ఆభరణాలు, టైటాన్ వాచ్ చోరీకి గురైనట్టు గుర్తించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచనల మేరకు కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది.. కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన బండారు మణికంఠ, చింతపల్లి వెంకట్రాజు అనే యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును త్వరితగతిన చేధించిన సీఐ విద్యాసాగర్, సీసీఎస్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సురేంద్ర, సీసీఎస్ ఏఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సీ బీఎస్ స్వామి, సిబ్బంది ఎం.వీర్రాజు, ఆర్.సుబ్రహ్మణ్యం, జి.కృష్ణసాయి, బి.అర్జునరావు, ఎస్.బ్లేషన్‌లను ఎస్పీ అభినందించారు.



మొసలిని డ్యామ్‌లోకి వదులుతున్న హోంగార్డు రామన్నదొర

అమ్మో! మొసళ్లు

డొంకరాయి డ్యామ్‌పై సంచారం

సాహసించి పట్టుకున్న హోంగార్డు

మోతుగూడెం, అక్టోబరు 2: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి డ్యామ్‌పై అర్ధరాత్రి వేళ మొసళ్లు సంచరిస్తున్నాయి. ఓ హోంగార్డు డ్యూటీ నిర్వహిస్తుండగా ఏదో అలికిడి అయిన శబ్దం వినిపించింది. పరిశీలించగా డ్యామ్‌పై రెండు మొసళ్లు కనిపించడంతో సహచర హోంగార్డులకి సమాచారం అందించాడు. వారు హుటాహుటిన మొసళ్లు సంచరిస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు. హోంగార్డుల అరుపులకు ఒక మొసలి డొంకరాయి రిజర్వాయర్లోకి దూకేసింది. హోంగార్డు ఎస్.రామన్నదొర సాహసం చేసి అరడుగుల పొడవున్న ఉన్న మొసలిని పట్టుకున్నాడు. దాని మూతికి తాడు కట్టి ఈడ్చుకుంటూ వెళ్లి రిజర్వాయర్లోని నీటిలో వదిలిపెట్టాడు. సాహసం చేసిన హోంగార్డు రామన్నదొరను ఏపీ జెన్‌కో ఉద్యోగులు, గ్రామస్తులు అభినందించారు.



కొడవలి పుష్కర కాలువలో గల్లంతైన సతీష్ కోసం గాలిస్తున్న దృశ్యం

పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 2: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతయ్యాడు. కొడవలి గ్రామానికి చెందిన ఉప్పనబోయిన సతీష్ (15) తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. అక్కడ పుష్కర కాలువలోకి దిగి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు సతీష్ ఆచూకీ లభించలేదు.



పాదగయ ఆవరణలో పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు

పిఠాపురం పాదగయకు
పోటెత్తిన భక్తులు

మహాలయ అమావాస్య సందర్భంగా పిండ ప్రదానాలు

పిఠాపురం, అక్టోబరు 2: కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి బుధవారం భక్తులు పోటెత్తారు. పితృ పక్షాలుగా వ్యవహరించే ఈ సమయంలో మహాలయ అమావాస్యకు విశేష ప్రాధాన్యత ఉంది. పితృ దేవతలకు ఈ రోజున పిండ ప్రదానాలు చేస్తే మంచిదనే నమ్మకంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి పిండ ప్రదానాలు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు పలువురు ప్రముఖులు పిండ ప్రదానాలు చేసేందుకు వచ్చారు. బైపాస్‌తో పాటు పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వాహనాలను బారులుతీరి నిలిపారు. పాదగయ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మహాలయ అమావాస్య సందర్భంగా పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి దేవస్థానానికి బుధవారం ఒక్కరోజు రూ.5.89 లక్షల ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథ రాజు తెలిపారు. పిండ ప్రదానాల టిక్కెట్ల ద్వారా రూ.2,46,500, అన్నదానం ద్వారా రూ.2,34,472, గ్రోగాసం టిక్కెట్ల ద్వారా రూ.4,602, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.47,825, పూజా టిక్కెట్ల ద్వారా రూ.55,360 వచ్చాయి.

విలీన మండలాల్లో ప్రారంభమైన
బతుకమ్మ సంబరాలు

ఎటపాక, అక్టోబరు 2: విలీన మండలాల్లో బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తోటపల్లి, సీతాపురం, గౌరిదేవిపేట, చోడవరం, నెల్లిపాక, నందిగామ తదితర గ్రామాల్లో మహిళలు, బాలికలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. తొలి రోజు వెంగిలి బతుకమ్మను ఏర్పాటు చేసి బతుకమ్మలను ఎత్తుకుని మహిళలు ప్రదక్షిణలు చేశారు. సంబరాలు తొమ్మిది రోజులు జరుగుతాయి.



తోటపల్లిలో బతుకమ్మను ఎత్తుకుని పాటలు పాడుతున్న బాలికలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

ఆలయాలలో ప్రముఖుల పూజలు

ఆత్రేయపురం, అక్టోబరు 2: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారంరాత్రి రాజమహేంద్రవరం ఫస్ట్ జిల్లా అడిషనల్ జడ్జి ఆర్.శివకుమార్, ఇస్కాన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు సత్యగోపీనాథ్‌స్వామి స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో రాజమహేంద్రవరం ఫస్ట్ జిల్లా అడిషనల్ జడ్జి ఆర్.శివకుమార్, దేవదాయ శాఖ ట్రిబ్యునల్ కోర్టు స్టాండింగ్ కౌన్సిల్ ఎంఎల్ఎన్ నరసింహారావు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


అంబాజీపేట: పుల్లేటికుర్రులో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



ఆత్రేయపురం: సర్పంచ్, కార్యదర్శిలను సత్కరిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు


మలికిపురంలో నివాళులర్పించిన ఎమ్మెల్యే దేవ, నాయకులు



రాజోలు: తాటిపాకలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కంచెర్ల బాబి

అహింసా పరమోధర్మః

- ఘనంగా మహాత్మాగాంధీ జయంతి
- గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు, అధికారులు

అమలాపురం టౌన్, అక్టోబరు 2: అహింసను మించిన ఆయుధం ప్రపంచంలో మరేదీ లేదని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మహాత్ముడు చూపిన బాటలో ప్రతీఒక్కరూ శాంతియుతంగా జీవించాలన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గడియార స్తంభం సెంటర్, గాంధీనగర్‌లోని మహాత్ముని విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, నల్లా శ్రీధర్, జంగా అబ్బాయివెంకన్న, బోనం సత్యవరప్రసాద్, వలవల శివరావు, అబ్బిరెడ్డి చంటి, భాస్కర్ల రామకృష్ణ, చిట్టూరి రాజేశ్వరి, యిళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ పూలమాలలువేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు కల్యాణం సత్యనారాయణ, వేమన వీవీ సత్యనారాయణ, వంగా అయ్యప్పకుమార్, నందెపు శ్రీనివాస్, బాలనాగు గుప్తా పాల్గొన్నారు. విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు ఎంఈవో-2 సరెళ్ల దుర్గాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకుల బాపన్ననాయుడు, ఎ.శ్యామలామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కె.దుర్గారావు, సర్వారాయుడు, పరిపాలనాధికారి జక్కల వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొనగా కళాశాలల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్ అభినందించారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్ముని విగ్రహానికి సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి తదితరులు పూలమాలలు వేసి చేనేత వస్త్రాలతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో బళ్ల వీర్రాజు, పిచ్చిక శ్యామ్, పెనుమాల ఏడుకొండలు, రుద్రరాజు బుజ్జిరాజు, మాడా మాధవి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు. పేరూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ అనంతరం స్వచ్ఛదివస్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులకు సత్కారాలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ దాసరి అరుణ, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బరామ్, వాసంశెట్టి శ్రీను, దొంగ ఆంజనేయులు, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, దాసరి డేవిడ్ పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక పచ్చిగోళ్ల జనార్థనరావు కల్యాణ మండపంలో గాంధీ, పొట్టిశ్రీరాములు, మాజీ సీఎం రోశయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నంబూరి సత్యనారాయణమూర్తి, నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, యెందూరి వెంకట్రామయ్య, వంకాయల కాశీ, వరదా సూరిబాబు, అప్పనవీరన్న పాల్గొన్నారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పుష్పాభిషేకం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఖాదీ ఉత్పత్తుల కొనుగోలు కార్యక్రమం జరిపారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆర్వీ నాయుడు, దూరి రాజేష్, ఆకుల వీరబాబు, గనిశెట్టి అరవింద్, ఆకుమర్తి బేబీరాణి, యనమదల రాజ్యలక్ష్మి, చిట్టూరి రాజేశ్వరి, చిలకమర్రి కస్తూరి, కొండేటి ఈశ్వర్‌గౌడ పాల్గొన్నారు. అమలాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దారా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి

అమలాపురం రూరల్: మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ఈదరపల్లిలోని ఆయన విగ్రహానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర, జిల్లా నాయకులు కర్రి చిట్టిబాబు, పొట్లూరి రామ్మోహనరావు, యిళ్ల సత్యనారాయణ, సత్యానందం, అడబాల సత్యనారాయణ, వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

గాంధీజీ బాటలో పయనించాలి: ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట: గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఆయన బాటలో నేటి యువత పయనించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో నూతనం గా నిర్మించిన మహాత్మాగాంధీ బస్‌షెల్టర్, గాంధీజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. స్థానిక ఆర్యవైశ్య నాయకులు గోకవరపు బాబు గాంధీజీ విగ్రహాన్ని బహూకరించడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, కాండ్రేగుల గోపాలకృష్ణ, నూకపెయ్యి చిన్న, అందె వెంకటముక్తేశ్వరరావు, వీరా రవి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు

మహాత్ముని బాటలో నడవాలి : ఎమ్మెల్యే దేవ

మలికిపురం: ప్రతీఒక్కరూ మహాత్ముని బాటలో నడవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మలికిపురం సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మార్కెట్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల యుగంధర్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, చెల్లింగి సత్యనారాయణ, సత్తిబాబు,సత్యనారాయణరాజు, శ్రీను పాల్గొన్నారు. లక్కవరం గ్రామసభలో పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే దేవ సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయంవద్ద గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పూలమాలలువేసి నివాళి అర్పించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్రరావు, జిల్లా ట్రేడర్స్ సెల్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యుడు కల్యాణ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు యాండ్ర బుల్లబ్బులు, స్వచ్ఛభారత్ కన్వీనర్ సతీష్‌నాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో పట్టణ సెక్షన్ కార్యాలయంలో, గాంధీ చిత్రపటానికి ఎస్ఈ సిద్దెల రాజబాబు, డీఈఈ రత్నాలరావు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఈ మేడిశెట్టి వెంకట రమణ, పి.బాలాజీ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. వైస్‌చైర్మన్లు శివాజీ, నాగేశ్వరరావు, కౌన్సిలరు వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చిరువ్యాపారి 24వ వార్డులో గొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి వేడుకలో మంత్రి సుభాష్ తండ్రి సత్యం గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.

● హసన్‌బాదలో గాంధీ చిత్రపటానికి జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, చేనేత సంఘం నాయకులు దొంతంశెట్టి సత్యప్రకాష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కె.గంగవరం: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రీ జయంతి వేడుకలు పామర్రులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రీ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూళ్లని ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో చిట్టూరి రామ్మోహన్, దామినేని శ్రీనివాసు, నాదెళ్ళ సతీష్, చిట్టూరి సురేంద్రనాథ్ చౌదరి, శ్రీధర్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు వల్లభనేని రవీంద్రబాబు, సలాది శేఖర్, కోడూరి విజయలక్ష్మి, సలాది రామకృష్ణ, కె.చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. అయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం లంకతల్లెమ్మ గుడి సెంటర్‌లో మహాత్మాగాంధీ నిలువెత్తు విగ్రహానికి టీడీపీ, జనసేన, ఆర్యవైశ్య, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, విళ్ల వీరాస్వామినాయుడు, పితాని రాంబాబు, నిమ్మకాయల విస్సు, పోలిశెట్టి కృష్ణ, రెడ్డి సుబ్బారావు, రెడ్డిశ్రీను, కంచర్ల నగేష్, కంచర్ల సురేష్, పి.వెంకటేశ్వరరాజు, ఎం.లక్ష్మణకుమార్, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.సుబ్రహ్మణ్యం, పీవీఎస్ఎన్ కుమార్, సీహెచ్ తిరుపతిరావు, కె.వెంకటలక్ష్మి, వి.హిమబిందులతో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఈవో ఎం.కమలకుమారి, ఏపీసీ ఎం.మధుసూదనరావు, సమగ్ర శిక్షా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మాజీమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ పుట్టినరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేకును కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, పెన్మెత్స చిట్టిరాజు, కమిడి ప్రవీణ్‌కుమార్, రాయపురెడ్డి జానకీరామయ్య, బొంతు బుజ్జిబాబు, దేవరపల్లి ఏడుకొండలు, సరిపల్లి రామకృష్ణంరాజు, కాశి జగపతి, కోనా వెంకట్‌శ్రీనివాసరావు, గొలకోటి ఆంజనేయులు, యలమంచిలి శ్రీను, కముజు శ్రీను, నల్లా రెడ్డినాయుడులతో పాటు పలువురు పాల్గొన్నారు. నగర పంచాయతీ కమిషనర్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. గాంధీ, మాజీప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, అడబాల సతీష్‌కుమార్, కాండ్రేగుల సత్యవతి, సరిపెల్ల రామకృష్ణంరాజు, ఆశ కార్యకర్తలు, సచివాలయ, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.


యానాంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: మానేపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పి.గన్నవరం అక్విడెక్టు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నివాళులర్పించారు.

గ్రామాల అభివృద్ధే నా అజెండా: ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం: గ్రామాల అభివృద్ధే అజెండా అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పారు. నార్కెడిమిల్లిలో బుధవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో తన గెలుపు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నార్కెడిమిల్లి గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, తోటకూర సుబ్బరాజు, మద్దింశెట్టి వీరవెంకట సత్యనారాయణ, తూము గణేష్, పాలా పల్లయ్య, కంఠంశెట్టి శ్రీనివాస్, కుదప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బండారును సత్కరించారు. ఆత్రేయపురం మహాత్మాగాంధీ విద్యాసంస్థలలో సెక్రటరీ, కరస్పాండెంట్ పీఎస్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాతి బుజ్జి, వివిధ గ్రామాల్లోని పంచాయతీల వద్ద సర్పంచ్‌లు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

ఉప్పలగుప్తం: గోపవరంలో సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆధ్వర్యంలో శానిటరీ వర్కర్లను సన్మానించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి రఘుబాబు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇసుకపట్ల రఘుబాబు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, పోలిశెట్టి శివాజీ పాల్గొన్నారు. అలాగే సర్పంచ్‌లు సలాది ఊర్మిళాసతీష్, కుంచే చిట్టికుమారిచిన్ని, నల్లా బాబండి, చిక్కం జంగమయ్య, కడిమి చిన్నవరాజు, గెడ్డం స్వరూపాసురేష్‌బాబు, జొన్నాడ శ్రీ దుర్గాచిన్ని, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, పెయ్యల రాజ్‌కుమార్, జిన్నూరి వెంకటేశ్వరరావు, బద్రి బాబ్జి, గుద్దటి మహాలక్ష్మీనాగరాజు, ఏవీ కృష్ణారావు, ఈవోపీఆర్డీ కేవీఎస్ గౌరీకుమారి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

అల్లవరం: మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరగిరిపట్నంలో గాంధీ జయంతి సందర్భంగా ఓడలరేవు బీవీసీ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌ఎస్ చంద్రమౌళి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్టీనాయుడు, వీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, మంతెన సురేష్‌రాజు, పిండి గణపయ్య తదితరులు పాల్గొన్నారు. గోడి, బోడసకుర్రు, యెంట్రుకోన, కొమరగిరిపట్నం గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. అల్లవరంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీనివాస్, రాకాపు విజయలక్ష్మి, తోట శ్రీదేవి, మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలోని తాటిపాకలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడ కంచెర్ల బాబి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాటిపాక సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి బాబి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబులు, కాసు శ్రీనివాస్, కృష్ణమోహన్, ఉప సర్పంచ్ కె.బుజ్జి, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు. రాజోలులో గాంధీనగర్ వద్ద మాంటిస్సోరిస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్.జోయాలక్ష్మి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోంపల్లి చిల్డ్రన్స్ పాఠశాలలో కరస్పాండెంట్ టీఎస్సార్ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఎస్ఎస్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.జయశ్రీ, బి.స్వర్ణ, దుర్గాదేవి, శిరీష, గాయత్రీ, సంధ్య, అరుణ, సౌజన్య, కనకదుర్గ, లావణ్య, బీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాం: యానాంలో జాతీయ నాయకులకు అధికారులు, పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. జాతిపిత మహాత్మగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రీ, అసెంబ్లీ స్పీకర్ కామిశెట్టి వరప్రసాదరావు నాయుడు జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణలు పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ సీఎం కామరాజనాడర్ వర్ధంతి సందర్భంగా ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

కపిలేశ్వరపురం: ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, ఎంపీడీవో కొండలరావుల ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అయినవిల్లి: నల్లచెరువులో బుధవారం సర్పంచ్ గుండు మోగుల వెంకటేశ్వరరావు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న గ్రీన్ అంబాసిడర్, క్లాప్ మిత్రలను సర్పంచ్ ఆధ్వర్యంలో సత్కరించారు. యార్లగడ్డ తోటయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత గ్రామసభ నిర్వహించారు.

మామిడికుదురు: జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో గల గాంధీ విగ్రహానికి కూటమి నాయకులు, కాంగ్రెస్ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, నాయకులు బోనం బాబు, అడబాల తాతకాపు సూదా బాబ్జి, కడలి నూకరాజు, దొంగ సత్తిబాబు, మందా గాంధీ, గెడ్డం వెంకటేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు

మండపేట: మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ఆధ్వర్యంలో బురుగుంట చెరువువద్ద గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. గాంధీనగర్‌లోవున్న గాంధీవిగ్రహం, పెద్దకాల్వ వద్ద వున్న గాంధీ విగ్రహాలకు వివిధ పార్టీలకు చెందిన నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు మండపేట ఏడిద రోడ్డులోవున్న కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎంపీడీవో సత్యనారాయణ కార్యాలయం సిబ్బంది గాంధీ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ద్వారపూడిలో కార్యదర్శి ఆకుల వెంకటరమణ, సర్పంచ్ కిన్నెర, కేశవరంలో ఎంపీపీ ఉండమట్ల వాసు, సర్పంచ్ సత్తిబాబు, జెడ్‌మేడపాడులో సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, వెలగతోడులు సర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శులు గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

'బాపూజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం'

కొత్తపేట: జాతిపిత బాపూజీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండల పరిధి వాడపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్‌లు బూసి జయలక్ష్మిభాస్కరరావు, త్సామా బాబు, బండారు బుల్లితాత, బండారు వీరబాబు, చీకట్ల అబ్బు, పప్పుల బుజ్జి, సాధుబాబు, కట్టా శ్రీను, బంగారం, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

కమిషన్ విచారణపై స్టే

మలికిపురం, అక్టోబరు 2: మలికిపురం ఏఎఫ్‌డీటీ ట్రస్టు ఆధ్వర్యంలో నడుపుతున్న ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తమ జీతాల కోసం సమ్మె చేస్తున్న సంగతి విదితమే. అధ్యాపకుల సమ్మెపై సమస్యను పరిష్కరించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కళాశాల వ్యవహారాలపై కమిషన్‌ను ఏర్పాటుచేశారు. విచారణా కమిటీపై యాజమాన్యం కోర్టుకు వెళ్లింది. దీంతో హైకోర్టు ఎటువంటి విచారణ చేయరాదని స్టే విధించింది. దీనిపై కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి వివరణ ఇస్తూ విచారణా కమిటీకి తాను వ్యతిరేకం కాదని, ప్రస్తుతం యాజమాన్యం గౌరవ హైకోర్టు వారిని సంప్రదించడానికి కారణం ప్రభుత్వం వారిని మా విద్యాసంస్థల ఆర్థిక వ్యవహారాలపై విచారణచేసే అధికారం మాత్రమే కలిగిన ప్రభుత్వ విభాగాలు తమ పరిధిని దాటి మా విద్యాసంస్థ పాలకవర్గాన్ని రద్దుచేసి ప్రత్యేక అధికారిని నియమించే విధంగా వారి ప్రయత్నాలు సాగుతున్న నేపథ్యంలో మాత్రమే తాము కోర్టుకు వెళ్లినట్టు తెలిపారు

యూట్యూబర్ అరెస్టు

కాట్రేనికోన, అక్టోబరు 2: నడవపల్లికి చెందిన యూట్యూబర్ కాశి ఊర్మిళాచక్రధరరావు(చక్రి) యానాం మద్యం విక్రయిస్తుండగా కాట్రేనికోన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి వీఎస్టీ చానల్ లోగో, ఎన్డీపీఎల్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆంధ్రజ్యోతిలో తీరంలో జోరుగా అక్రమ మద్యం శీర్షికన ప్రచురితమైన వార్తకు కాట్రేనికోన పోలీసులు స్పందించారు. గాంధీ జయంతి రోజు బుధవారం బలుసుతిప్పలో అక్రమ మద్యం విక్రయాలపై దాడి చేశారు. నాలుగు కేసుల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఐ.అవినాష్ తెలిపారు. మద్యం విక్రేతలు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 2: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భీమవరం మండలం పాలకోడేరుకు చెందిన కందరాజు శాన్విక్‌శివవర్మరూ.లక్ష విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు నల్లం చక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. బుధవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,94,407 లభించినట్టు ఈవో చక్రధరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముమ్మిడివరం, అక్టోబరు 2: మోటారుసైకిల్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులను ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో వారు ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన ముమ్మిడివరం మెయిన్‌రోడ్డులో కోకోనట్ వర్తక సంఘ భవనంవద్ద మంగళవారం రాత్రి జరిగింది. క్రాప శంకరాయగూడేనికి చెందిన సవరపు వెంకటేశ్వరరావు, ఎస్.మూలపొలానికి చెందిన చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, శానపల్లిలంకకు చెందిన పెండెం శ్రీనివాసరావులు ముగ్గురు హోండా యాక్టీవా మోటారుసైకిల్‌పై ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లోకి వెళుతుండగా కోకోనట్ భవనం వద్ద మురమళ్ల నుంచి అమలాపురం వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెలర్ బస్సు వారిని ఢీకొనడంతో వారు ముగ్గురు ఢీకొన్నారు. వెంకటేశ్వరరావు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, పెండెం శ్రీనివాసరావులు అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలు అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన అప్పాయమ్మ

ముమ్మిడివరం, అక్టోబరు 2: ముమ్మిడివరం నగర పంచాయతీ 15వ వార్డు రాయుడువారిపాలేనికి చెందిన వక్కా అప్పాయమ్మ అదృశ్యమైంది. మంగళవారం రాత్రి టిఫిన్ చేసిన తరువాత తన గదిలో నిద్రించిందని బుధవారం తెల్లవారుజామున చూసేసరికి ఆమె ఇంట్లో లేదని, చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ లభ్యంకాలేదని కొడుకు, కోడలు పేర్కొంటున్నారు. అప్పాయమ్మకు కుమారుడు వీరవెంకటసత్యనారాయణ, కోడలు మనుమలు ఉన్నారు. మనుమడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.భైరవస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మామిడికుదురు, అక్టోబరు 2: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నగరం గ్రామానికి చెందిన వానరాశి నరసింహారావును అరెస్టు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. బుధవారం మద్యం షాపులకు సెలవు కారణంగా ముందుగా మద్యం బాటిళ్లు కొనుగోలుచేసి వాటిని ఇంటి వద్ద అధిక ధరకు విక్రయిస్తుండడంతో మధ్యవర్తుల సమక్షంలో నిందితుడిని అరెస్టుచేసి అతని వద్ద నుంచి రూ.9780 విలువైన 60మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండుకు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

'మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

అమలాపురంటౌన్, అక్టోబరు 2: మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను పరిష్కరించే వరకు పోరుబాటను కొనసాగిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జీపీఎఫ్, పదోన్నతులు, బదిలీల సమస్యల పరిష్కారంలో మున్సిపల్, విద్యాశాఖ అధికారులు చేస్తున్న తాత్సారానికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బుధవారం యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1800కు పైగా పోస్టులను అప్‌గ్రేడేషన్ చేయాల్సి ఉండగా ఇంత వరకు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆరోపించారు. మున్సిపల్ సబ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు రాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శించిందని విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జీవో నంబరు 117ను రద్దు చేయాలని డిమాండు చేశారు.

మోదీ ప్రభుత్వ తీరుకు నిరసనగా మౌనదీక్ష

అమలాపురం టౌన్, అక్టోబరు 2: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కులమత విద్వేషాలను రెచ్చగొడుతూ దేశంలో సమైక్యత, సమగ్రతకు విఘాతం కలిగిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌనదీక్ష చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో అమలాపురంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బ్యానరుతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీనివాస్, ముషిణి రామకృష్ణారావు, పేరి శర్మ, జోగి అర్జునరావు, షకీలా, సుగ్గు ప్రసాద్, వస్కా బాబు, పులుసుగంటి ప్రకాష్, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని ఐద్వా జిల్లాశాఖ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మహాత్ముని విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఐద్వా జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్డీ హమీద్ ఉన్నీసా, టి.నాగవరలక్ష్మి, మండలశాఖ ప్రతినిధులు ఆర్.సుశీల, కె.సత్యదేవి, బి.లక్ష్మీకుమారి, చంద్రకళ, బి.భువనేశ్వరి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు


సుబ్బయ్య (ఫైల్)

కపిలేశ్వరపురం, అక్టోబరు 2: మండలంలోని అంగర పోలీస్ స్టేషన్‌లో బుధవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాలేరుకి చెందిన అవివాహితుడు ఎరమాటి సుబ్బయ్య అలియాస్ తాతరాజు(40)గతనెల 27న రాజమహేంద్రవరం వెళ్లి వస్తాననిచెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో అతని అన్న జాన్‌ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

అమలాపురం టౌన్, అక్టోబరు 2: సమగ్రశిక్ష ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి జిల్లా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. మహాత్మా తమ గోడును వినిపించుకుని పెండింగ్ వేతనాలు విడుదల చేసేలా చూడాలని కోరారు. ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడంలేదని ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలల బకాయి వేతనాలు విడుదల చేయడంతో పాటు ప్రతీ నెల 1వ తేదీన ప్రభుత్వం జీతాలు చెల్లించాలని వినతిపత్రంలో కోరారు.

ఎంపీ పురందేశ్వరితో మల్లాడి భేటీ

యానాం, అక్టోబరు 2: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరితో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. విజయవాడ వెళ్లిన మల్లాడి మంగళవారంరాత్రి పురందేశ్వరిని కలిసి సమస్యల వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సముద్ర పరివాహక ప్రాంతంలో (కాకినాడసిటీ, రూరల్, పిఠాపురం, తుని తదితర)ఉన్న పలువురు మత్స్యకారులకు చమురు సంస్థల పరిహారం ఇప్పించాలని కోరారు.

గాంధీ జయంతి రోజున జోరుగా మద్యం అమ్మకాలు

అల్లవరం, అక్టోబరు 2: మహాత్మాగాంధీ జయంతి రోజున మండలంలోని పలు గ్రామాల్లో అనధికార బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గాంధీ జయంతి రోజున మద్యం షాపులకు సెలవు ప్రకటించడంతో ముందురోజునే మద్యం బెల్ట్‌షాపుల నిర్వాహకులు భారీగా మద్యం కొనుగోలు చేశారు.

'సమాజంలో గురువులు పాత్ర ఉత్తమమైనది'

కొత్తపేట, అక్టోబరు 2: సమాజంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉన్నతమైన పాత్రను ఉపాధ్యాయులు పోషిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక కాంతిభారతి పాఠశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే బండారు సత్కరించారు. అనంతరం కాంతి భారతి యజమాన్యం తోట వెంకటేశ్వరరావు, తోట సత్యవాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, యల్లమిల్లి జగన్మోహన్, బయ్యే రాంబాబు, కాశీ ధనరాజు, ముద్రగడ ఫణి, కడలి భీమా, కముజు శ్రీను, శీలం సూర్య చంద్రరావు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా'

పి.గన్నవరం, అక్టోబరు 2: పి.గన్నవరం నియోజకవర్గ ప్రధాన కేంద్రంతోపాటు పరిసర గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం గ్రామపంచాయతీ ఆవరణలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై జరిగన గ్రామసభకు సర్పంచ్ బొండాడ నాగమణి అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. శివారు గ్రామాలలోని రహదారులు అభివృద్ధికి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం శానిటేషన్ సిబ్బందిని అభినంధించి ప్రశంసా పత్రాలు అందించారు. ఎంపీడీవో ఎం.భారతీ, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరావు, ఏపీవో లక్ష్మీ నారాయణ, కార్యదర్శి అప్పారావు, ఉపసర్పంచ్ పెచ్చెట్టి ఈశ్వర్, కుమార్, పెద్దిరాజు, శ్రీవెంకటసత్య నారాయణ, గుత్తుల రామకృష్ణ, చినసుబ్బారాయుడు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రాయవరం, అక్టోబరు 2: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో 53వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి 12వ తేదీ వరకు ప్రతిరోజు విజయదుర్గా అమ్మవారి ఒక్కొక్క అవతారంలో అలంకరించి పూజలు చేస్తారని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు.